# కథ

వాణిశ్రీ

శేఖర్ చాలాకాలం క్రితం మద్రాస్ వెళ్ళి ప్రముఖ సినిమా డైరెక్టర్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాడు. నాలుగైదేళ్ళ తర్వాత అసోసియేట్ డైరెక్టర య్యాడు. ఇక అప్పట్నుంచి అసోసియేట్‌గానే కొనసాగుతున్నాడు. డైరెక్టర్ అయ్యే అవకాశం రాలేదు. తర్వాత సినిమా పరిశ్రమ హైదరాబాద్‌కి తరలి వచ్చింది. నలుగురితోపాటు నారాయణా అని శేఖర్ కూడా హైదరాబాద్ వచ్చేశాడు. యూసఫ్‌గూడాలో అద్దె ఇంట్లో చేరాడు.

శేఖర్ క్లాస్‌మేట్ రవికుమార్ ఒకరోజు అనుకోకుండా కలిశాడు. ఇద్దరూ పాతరోజులు జ్ఞాపకం తెచ్చుకుని ఆనందించారు.

''పాతికేళ్ళ నుంచి అసోసియేట్‌గానే వుండిపోయావు. డైరెక్టర్ ఛాన్స్ రాలేదా?'' అడిగాడు రవికుమార్.

శేఖర్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

''రాలేదు'' అన్నాడు.

''నువ్వెప్పుడూ ప్రయత్నించలేదా?''

''ప్రయత్నించడం అంటే సినిమా ఫీల్డులో రెగ్యులర్‌గా సినిమాలు తీసే నిర్మాతలు తగ్గిపోయారు. వచ్చేపోయే నిర్మాతలే ఎక్కువ. ఒక్క సినిమా మాత్రమే ఎలాగోలా తీసి జెండా పీకే కొత్త ప్రొడ్యూసర్లే వస్తున్నారు. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్లు వాళ్ళే ప్రొడ్యూసర్లుగా మారిపోతున్నారు. ఇక మనకి ఛాన్స్ ఎవరిస్తారు?'' అన్నాడు శేఖర్.

''నాకు తెలిసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వున్నాడు. సినిమా తియ్యాలనుకుంటున్నాడు. నీ దగ్గర ఏదైనా యూత్‌కి నచ్చే సబ్జెక్టు వుంటే రెడీ చెయ్యి. నీకు డైరెక్షన్ ఛాన్స్ ఇస్తాడు. నేను అతన్ని పరిచయం చేస్తాను'' అన్నాడు రవి.

''బాగా డబ్బున్నాయనేనా? ఎందుకంటే కొత్త వాళ్ళకి సినిమా టెక్నిక్‌మీద అవగాహన వుండదు. పది లక్షలుంటే సినిమా తయారైపోతుందనుకుంటారు. అందుకు కారణం కొందరు మావాళ్ళే. కొత్తప్రొడ్యూసర్ వాలాడు అని తెలియగానే చుట్టూ కాకుల్లా చేరిపోతారు. ఐదు లక్షలున్నా చాలు సినిమా మొదలుపెట్టొచ్చు. షూటింగ్ జరుగుతుండగానే బయ్యర్లొచ్చి అడ్వాన్సులిచ్చేస్తారు. లేకపోతే అప్పులిచ్చే ఫైనాన్సియర్లున్నారని నమ్మించి దించుతారు. వాళ్ళు చెప్పేది ఏదీ జరగదు. ఆ ప్రాజెక్టు మధ్యలో ఆగిపోతుంది'' అన్నాడు శేఖర్.

''ఏమీ తెలియని కొత్తవాళ్ళని అలా దించితే లాభం ఏమిటి?''

''ఏం లేదు. వాళ్ళకి ఆ నెల జరిగితే చాలు. ఆ వచ్చినవాడు పిచ్చోడైపోయినా ఫరవాలేదు. వాళ్ళకి

## ఛాన్స్

చీమకుట్టినట్లుండదు''

''మా వాడు అట్లా కాదులే. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బాగా సంపాదించాడు. మినిమమ్ ఎంత కావాలేం?''

''కోటి రూపాయలుంటే లవ్‌స్టోరీ కొత్తహీరోతో ప్లాన్ చెయ్యొచ్చు. ఇటువంటి వాటికి ఏ ఫైనాన్సియరూ అప్పు ఇవ్వడు'' ఖచ్చితంగా చెప్పాడు శేఖర్.

''సరే! నేను మాట్లాడి ఫోన్ చేస్తాను'' అన్నాడు రవికుమార్.

''ఐతే మంచిరోజు చూసి పూజ చేసి బేనర్ రిజిస్ట్రేషన్ కానివ్వండి. స్టోరీ డిస్కషన్ మొదలుపెట్టండి. అదే టైములో మంచి కుర్రాడిని వెతికి పట్టుకుంటే హీరో సెలక్షనైపోతుంది. కేరెక్టర్ ఆర్టిస్టులు, కమేడియన్లు మన శేఖర్‌కి పరిచయమే. అడ్వాన్సులిచ్చి కాల్షీట్స్ తీసుకుంటాడు'' అన్నాడు రవికుమార్.

* * *

శేఖర్‌కి వుత్సాహం వచ్చింది. 'ఏమో తన అదృష్టం వలన డైరెక్టర్ అయ్యే ఛాన్స్ ఇన్నాళ్ళకి వచ్చిందేమో? దీనిని సద్వినియోగం చేసుకోవాలి' అనుకున్నాడు.

తను అప్పుడప్పుడూ తయారు చేసుకున్న కథలు బైటకు తీశాడు. 'ఇప్పుడు సినిమాలు చూస్తున్న వాళ్ళంతా స్టూడెంట్స్, యువకులే కాబట్టి లవ్‌స్టోరీ తీస్తే వర్కవుట్ అవుతుంది' అని నిర్ణయించుకుని కొన్ని లవ్‌స్టోరీ లైన్లు సిద్ధం చేసుకున్నాడు.

నాలుగు రోజులు తర్వాత రవికుమార్ వచ్చి శేఖర్‌ని యాదగిరిరెడ్డి దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయన మియాపూర్‌లో పెద్దబిల్డింగ్ కట్టుకుని స్థిరపడ్డాడు. ఆ చుట్టుపక్కలే రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడు.

''రెడ్డిగారూ! ఈయనే నా ఫ్రెండ్ శేఖర్. పాతికేళ్ళ నుంచి సినిమా ఫీల్డులో వున్నాడు'' అని పరిచయం చేశాడు రవికుమార్.

''నమస్తే డైరెక్టర్ సాబ్! నీ గురించి రవిసాబ్ మంచిగా చెప్పిండు. నాకైతే ఏం తెల్వద్ సినిమా ఫీల్డు. మావోడు సిన్మా తీద్దాం నాయినా అని ఒకటే లొల్లి చేస్తుండు. వాని కోసమే షురూ జేయాలనుకుంటున్నా'' అన్నాడు యాదగిరిరెడ్డి.

''అంతేలెండి. మీకు రియల్ ఎస్టేట్‌లోనే తీరిక లేదు. అదెక్కడ చూసుకుంటారు. దాన్ని అబ్బాయికి వదిలేయండి. మా శేఖర్ జాగ్రత్తగా చూసుకుంటాడు. సేఫ్ ప్రాజెక్టు చేసి పెడతాడు'' అన్నాడు రవికుమార్.

''గట్లనే భైయ్! మావోన్ని పిలుస్తా!'' అని ''చంద్రా! చంద్రా!'' అని కేకపెట్టాడు.

చంద్రారెడ్డి వస్తూనే ''అంకుల్ నమస్తే!'' అన్నాడు రవికుమార్‌ని చూసి.

రవికుమార్ చంద్రారెడ్డిని శేఖర్‌కి పరిచయం చేశాడు. శేఖర్ చంద్రారెడ్డిని పరిశీలనగా చూశాడు. చదువుకున్నవాడే అనిపించింది.

''డైరెక్టర్ సాబ్! మావోనికి జర జెప్పుండ్రి సిన్మాకి ఎంతైతవి? ఏవేం గావాలా అయన్నీ'' అన్నాడు యాదగిరిరెడ్డి.

''డబ్బు కావాలి. కొత్త హీరోతో కోటి రూపాయలవుతుంది'' అని షూటింగ్‌కి ఇంత, లాబ్‌కి, టెక్నీషియన్స్‌కి, ఎడిటింగ్, సాంగ్ రికార్డింగ్, రీరికార్డింగ్, ఆర్టిస్టులకి అన్నీ లెక్కలేసి బడ్జెట్ వేసి చూపించాడు శేఖర్.

''అన్నిటికన్నా ముఖ్యమైంది స్టోరీ. రెండు నెలలైనా స్టోరీమీద హోమ్ వర్కు చేసుకుని స్క్రిప్ట్ రెడీ చేసుకోవాలి'' అన్నాడు శేఖర్.

''ఔ గదా! మీకాడ స్టోరీలున్నాయని రవి సాబ్ చెప్పిండే..'' అన్నాడు యాదగిరి రెడ్డి.

''ఔను సార్!''

''చెప్పండి. మావాడికి నచ్చితే..ఓ.కె.'' అన్నాడు యాదగిరిరెడ్డి.

శేఖర్ గంటసేపు కథ చెప్పాడు.

''ఇదీ కథ. హీరో హీరోయిన్లు కొత్తవాళ్ళయినా కేరెక్టర్ ఆర్టిస్టులు, కమేడియన్స్, టెక్నీషియన్లు మాత్రం పాతవాళ్ళే వుండాలి. లేకపోతే క్వాలిటీ రాదు. అవన్నీ నేను చూసుకుంటాను. మీకు కథ

నచ్చితే'' అన్నాడు శేఖర్.

చంద్రారెడ్డి తండ్రికి సైగ చేశాడు. తర్వాత ఇద్దరూ బైటకు వెళ్ళి ఏదో మాట్లాడుకున్నారు. పావుగంట తర్వాత తిరిగి వచ్చి కూర్చున్నారు.

''డైరెక్టర్ సాబ్! మావోనికి మీ స్టోరీ నచ్చింది'' అన్నాడు యాదగిరి.

శేఖర్‌కి ఎగిరి గంతెయ్యాలనిపించింది. పాతికేళ్ళ సీనియార్టీ తర్వాత డైరెక్టర్ అయ్యే ఛాన్స్ తగిలింది. చాలా సంతోషించాడు. దేనికైనా కాలం కలిసి రావాలి. అదిప్పుడు వచ్చింది అని తెగ ఆనందపడ్డాడు.

''థాంక్యూ!'' అన్నాడు శేఖర్.

''మరింకేం? యూసఫ్‌గూడాలోనో, శ్రీనగర్ కాలనీలోనో ఆఫీసు ఓపెన్ చేసేసి మొదలుపెట్టేసెయ్యండి'' అన్నాడు రవికుమార్.

''ఆఫీస్ రెడీగుంది భై. డెవలప్‌మెంట్‌కి పాత బిల్డింగ్ గదే ఏరియాలో కొన్నాం గదా! గందులోనే షురూ చేద్దాం'' అన్నాడు యాదగిరిరెడ్డి.

''ఐతే మంచిరోజు చూసి పూజ చేసి బేనర్ రిజిస్ట్రేషన్ కానివ్వండి. స్టోరీ డిస్కషన్ మొదలుపెట్టండి. అదే టైములో మంచి కుర్రాడిని వెతికి పట్టుకుంటే హీరో సెలక్షనైపోతుంది. కేరెక్టర్ ఆర్టిస్టులు, కమేడియన్లు మన శేఖర్‌కి పరిచయమే. అడ్వాన్సులిచ్చి కాల్షీట్స్ తీసుకుంటాడు'' అన్నాడు రవికుమార్.

''హీరో ఎతుకుటెందుకు? మన చంద్ర వున్నాడుగా!'' అన్నాడు యాదగిరిరెడ్డి.

''మన చంద్రారెడ్డి హీరోనా?'' నోరు తెరిచాడు రవికుమార్.

శేఖర్ నెత్తిన పిడుగుపడినట్లయింది. మరొకసారి చంద్రారెడ్డి వైపు చూశాడు. మనిషి పొట్టి. వినాయకుడి పొట్ట. హీరోకి కాదు గదా కమేడియన్‌కి కూడా పనికి రాడు.

అదృష్టం తలుపుకొట్టినట్టే కొట్టి వెనక్కి జారిపోయినట్లు, చేతిలోకి వచ్చిన ముద్ద నోటివరకూ వెళ్ళకుండా నేలమీద పడినట్లు ఫీలయ్యాడు శేఖర్. రవికుమార్ వైపు అయోమయంగా చూశాడు.

రవికుమార్ ఏడవలేక నవ్వాడు.

''అదికాదు రెడ్డీసాబ్! మొదటిసారే హీరోవేస్తే ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారో లేదో! (భయపడతారో అనబోయి తమాయించుకున్నాడు) ఫస్ట్ పిక్చర్లో చిన్న వేషం వేయిద్దాం బాబుతోటి. నటనకు అలవాటుపడతాడు. తర్వాత నెమ్మదిగా హీరో చెయ్యొచ్చు'' నచ్చజెప్పబోయాడు రవికుమార్.

యాదగిరి రెడ్డి పకపక నవ్వాడు.

''మనం కొత్తలోనే హీరో జేద్దామని గదా డిసైడ్ జేసినం. ఎవడో కొత్తోడు బదులు చంద్రనే హీరో జేద్దాం. ఆళ్ళమ్మ ఆడిని హీరో జెయ్యాలనీ, గాతర్వాతనే పెండ్లి జెయ్యాలనీ పట్టుపట్టింది భై. సిన్మాల్లోకి దిగేదే గందుకు' అసలు సంగతి చెప్పాడు యాదగిరిరెడ్డి.



చంద్రారెడ్డి మెలికలు తిరిగిపోతూ సిగ్గుపడిపోతున్నాడు.

శేఖర్‌కి కంపరం పుట్టింది.

''సరే సార్! కలుస్తా!'' అని లేవబోయాడు శేఖర్.

''అరె కూర్చో భై. పార్టీ జేసుకుందాం. చంద్రా ఫారిన్ విస్కీ తెప్పించిండు'' అన్నాడు యాదగిరిరెడ్డి.

''ఇప్పుడు కాదు సార్! వంట్లో బాగాలేదు. తర్వాత చేసుకుందాం పార్టీ'' అన్నాడు శేఖర్.

రవికుమార్ కూడా లేచాడు. ఇద్దరూ సెలవు తీసుకుని బైటపడ్డారు.

★ ★ ★

మర్నాడు శేఖర్, రవికుమార్‌కి ఫోన్ చేశాడు.

''రవీ! నాకీ డైరెక్షన్ ఛాన్స్ వద్దురా బాబూ!'' అన్నాడు.

''ఏం?''

''చంద్రారెడ్డిని హీరోగాపెట్టి సినిమా తీస్తే నా ఫ్రెండ్స్ చెప్పుతో కొడతారు. పాతికేళ్ళనుంచి నాకున్న కాస్త పేరు మట్టికొట్టుకుపోతుంది. నా గతి అధోగతే. అంతకంటే అసోసియేట్‌గానే కాలక్షేపం చెయ్యడం నా ఆరోగ్యానికి మంచిది'' అన్నాడు శేఖర్.

''పిచ్చోడిలాగా వున్నావే! ఏదో ఛాన్స్ దొరికినప్పుడు కాస్త డబ్బుచేసుకోక!'' అన్నాడు రవికుమార్.

''ఛాన్స్ దొరికిందని తీస్తే నాకు అదే ఆఖరు సినిమా. ఒకసారి డైరెక్టర్ హోదా అనుభవించాక, అసోసియేట్‌గా ఎలా వెళ్ళగలను? ఎవరూ పిలవరు గూడా'' అన్నాడు శేఖర్.

''నీ ఇష్టం'' అన్నాడు రవికుమార్.